క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



ఎమ్మెల్యే రఘునందన్‌రావుతో జేకే శేఖర్‌యాదవ్

జగద్గిరిగుట్ట: దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావును గురువారం రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు జేకే శేఖర్‌యాదవ్ బంజారాహిల్స్‌లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో గండి రాజుయాదవ్, స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

3న ల్యాప్‌టాప్, స్కాలర్‌షిప్‌ల పంపిణీ

సనత్‌నగర్: పేద విద్యార్థులకు చేయూతనందించే లక్ష్యంతో బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య (బీఎస్‌ఎస్‌ఎస్) తెలంగాణ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3న ల్యాప్‌టాప్, స్కాలర్‌షిప్పుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ అన్నారు. కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ను గురువారం కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం ప్రాంగణంలోని అన్నపూర్ణ భవనంలో జరిగే ఈ బృహత్తర కార్యక్రమంలో 200 మందికి ల్యాప్‌టాప్‌లు, స్కాలర్‌షిప్పులు అందజేయడం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, విశిష్ట అతిథులుగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్సీ వాణీదేవి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, నీటి పారుదల కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలాచారిలు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అర్చక, ఉద్యోగ జేఏసీ కన్వీనర్ పరాశరం రవీంద్రాచార్యులు, సమాఖ్య ప్రతినిధులు ఎంవీ శాస్త్రి, రామచంద్రమూర్తి, విజయలక్ష్మీ, పంచగంగేశ్వర్, రవీంద్ర, సోమయాజులు, ఉపేంద్రకుమార్ పాల్గొన్నారు.

బీసీలను చైతన్యం చేస్తాం

పంజగుట్ట: రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని... జనాభా ప్రాతిపదికన సీట్లు మాత్రం ఇవ్వడం లేదని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్‌ఎస్) సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మధుగౌడ్ కక్కెర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని బీసీలకు ఐక్యం చేసేందుకు ఇప్పటికే ప్రణాళిక రూపొందించామని వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ బీసీని ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటిస్తుందో ఆ పార్టీకే బీసీల మద్దతు ఇచ్చేలా బీసీల్లో చైతన్యం తీసుకొస్తామని ఆయన పేర్కొన్నారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీ కులాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం సేవా సంస్థగా కొనసాగుతున్న తెలంగాణ రక్షణ సమితి (టీఆర్‌ఎస్)ను త్వరలోనే రాజకీయ పార్టీగా మార్చనున్నట్లు, వచ్చే ఎన్నికల నాటికి పార్టీ రిజిస్ట్రేషన్ పూర్తిచేసి ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి తీసుకుని అన్ని స్థానాల్లో పోటీ చేస్తామని తెలిపారు. అధికార బీఆర్‌ఎస్ పార్టీ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలకు కేవలం 20 శాతం సీట్లు ఇచ్చి మోసం చేసిందని, తక్కువ శాతం ఉన్న అగ్రకులాలకు 50కి పైగా టిక్కెట్లు ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీలు అయినా స్పందించి బీసీలకు తగు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమావేశంలో బీసీ నాయకులు నర్సింగరావు, రాజ్ గణేష్, బింగి రాములు, పి.గణపతి, లక్ష్మణ్, హైమావతి, శివకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

లిబర్టీ: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 22 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని దళిత బహుజన విద్యార్థి సమాఖ్య తెలంగాణ రాష్ట్ర శాఖ కో ఆర్డినేటర్ ఇటికా గణేష్ ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించాలని కోరారు. గురువారం సమాఖ్య కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేవలం ఐదు వేల టీచర్ పోస్టులకు మాత్రమే ప్రభుత్వం భర్తీ చేస్తుందని పేర్కొన్నారు. ప్రధానంగా ఆంగ్ల, గణిత, సైన్స్ వంటి కీలక పోస్టులు చాలా కాలంగా ఖాళీగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులు అనేక సంవత్సరాలుగా ఖాళీగా ఉండటం వల్ల విద్యా ప్రమాణాలు పడిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేటు, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ విద్యా సంస్థలను తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా ఆచరణలో ఉపాధ్యాయ పోస్టులు ఎందుకు భర్తీ చేయడం లేదని ప్రశ్నించారు. 30 మంది విద్యార్థులకు ఒక్క టీచర్ ఉన్నారని ఇది హేతుబద్ధం కాదని అన్నారు.

రాఖీ కట్టి.. ఆశీర్వదించి

రాఖీ పర్వదినాన్ని కుత్బుల్లాపూర్ నియోజవకర్గ వ్యాప్తంగా గురువారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు తమ సోదరులకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి హారతులు పట్టారు. ప్రధాన మార్కెట్ల రాఖీలు, స్వీట్లు కొనుగోలుతో రద్దీగా మారాయి. శంబీపూర్‌లో ఎమ్మెల్సీ శంబీపూర్‌రాజుకు, పేట్‌బషీరాబాద్‌లో ఎమ్మెల్యే వివేకానంద్, షాపూర్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ లకు మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి రాఖీలు కట్టి హారతులు పట్టారు.
– కుత్బుల్లాపూర్



ఎమ్మెల్యే వివేకానందకు రాఖీలు కడుతున్న మహిళలు



సోదరులకు రాఖీలు కడుతున్న సోదరీమణులు



మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌కు రాఖీలు కడుతున్న మహిళలు



కార్మికశాఖ మంత్రి మల్లారెడ్డికి రాఖీ కడుతున్న మాజీ ఎంపీపీ సన్న కవిత



బీజేపీ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డికి రాఖీ కడుతున్న జిల్లా నాయకురాలు శ్రీదేవి



బాచుపల్లిలో

టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డికి రాఖీలు కడుతున్న మహిళలు



టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటిరెడ్డి పున్నారెడ్డికి రాఖీలు కడుతున్న మహిళలు



ఎమ్మెల్సీ శంబీపూర్ రాజుకు రాఖీలు కట్టి హారతులు ఇస్తున్న మహిళలు

ఓటరు నమోదుపై స్పెషల్ క్యాంపెయిన్

- కుత్బుల్లాపూర్ ఎన్నికల అధికారి పులి సైదులు



కుత్బుల్లాపూర్: రెండో స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా సెప్టెంబర్ 2, 3వ తేదీల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి పులి సైదులు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఓటరు నమోదు అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. మొత్తం 582 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. పారదర్శకంగా ఓటరు జాబితాను తయారు చేసే క్రమంలో అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ముందస్తుగా ఓటు నమోదు చేసుకోవచ్చని సూచించారు.

◆ ఆగస్టు 21వ తేదీన ఓటరు ముసాయిదా విడుదల చేసిన జాబితాలో పేరు ఉందో.. లేదో అన్న విషయాన్ని పరిశీలించుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో పేరులో ఏదైనా తప్పులు ఉన్నట్లు గుర్తిస్తే వాటిని సవరించుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. నూతన ఓటరు నమోదు దరఖాస్తు-6, ఆధార్ అనుసంధానం దరఖాస్తు-6బీ, ఓటరు జాబితా అభ్యంతరాలు ఓటర్ తొలగింపునకు దరఖాస్తు-7, మార్పులు చేర్పులకు దరఖాస్తు-8లను సెప్టెంబర్ 19వ తేదీ వరకు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

'నేను చేసిన అభివృద్ధే నన్ను గెలిపిస్తుంది'



ఎమ్మెల్యే వివేకానంద్‌కు ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న మారుతీనగర్ సంక్షేమ సంఘం సభ్యులు

రంగారెడ్డినగర్: తాను చేసిన అభివృద్ధే తనను గెలిపిస్తుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ మారుతీనగర్ సంక్షేమ సంఘం సభ్యులు గురువారం పేట్‌బషీరాబాద్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు పూర్తి చేసిన ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం మూడోసారి ఎన్నికల బరిలో నిలబడిన ఎమ్మెల్యే వివేకానంద్‌ను తమ మద్దతు తెలుపుతూ తీర్మాన పత్రాన్ని అందజేశారు. వెల్ఫేర్ అసోసియేషన్ సలహాదారులు జె రాఘవులు, శ్రీనివాస్, సంతి భూషణ్, ఆనందన్, ప్రెసిడెంట్ శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ విశ్వనాథం, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ వెంకటేష్, భాను చందర్, సెక్రటరీ గణేష్, జాయింట్ సెక్రటరీ, సుమన్ ఆనంద్, కోశాధికారి పద్మనాభ రెడ్డి, ఆర్గనైసింగ్ సెక్రటరీస్ శేఖర్ రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మహిళాభ్యున్నతికి కృషి



కుండలు తయారీని తిలకిస్తున్న మర్రి ఆదిత్యరెడ్డి

సనత్‌నగర్: డాక్టర్ మర్రి చెన్నారెడ్డి ఫౌండేషన్, సావిత్రమ్మ స్కిల్ సెంటర్ ద్వారా మహిళలు జీవనోపాధి నైపుణ్యాలతో పాటు సాధికారత కల్పిస్తామని టీపీసీసీ సభ్యులు మర్రి ఆదిత్యరెడ్డి హామీనిచ్చారు. భోలక్‌పూర్, బర్తన్ కాంపౌండ్, అమీర్‌పేట కుమ్మరిబస్తీలలో బుధవారం ఆయన పర్యటించారు. బర్తన్ కాంపౌండ్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడికి ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం అమీర్‌పేట డివిజన్ కుమ్మరిబస్తీలో పర్యటించి కుమ్మరుల కష్టాలు తెలుసుకుని వారికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు సాధికారత సాధించి అధిక ఆదాయాలు పొందాలనేదే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో విఠల్, డాక్టర్ శివకుమార్‌లాల్, జగదీష్, సాయిగౌడ్, కృష్ణయాదవ్, శైలేష్, శ్యాం, విలాస్‌రావు, నరేష్, శంకర్, కాంతారావు, దశరథ్, ఆర్.కృష్ణ, బసవరాజు పాల్గొన్నారు.

మేథో సంపత్తి హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రొ. జీబీ రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ: మేథో సంపత్తి హక్కుల (ఐపీఆర్) పై పరిశోధన విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన అవసరమని ఓయూ న్యాయకళాశాల ప్రొఫెసర్ జీబీ రెడ్డి అన్నారు. గురువారం క్యాంపస్‌లోని సైన్స్ కాలేజీ ఆడిటోరియంలో తెలంగాణ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (టీఎస్‌సీవోఎస్‌టీ), ఓయూ ఐపీఆర్ సెల్ ఆధ్వర్యంలో ఐపీఆర్‌పై నిర్వహించిన అవగాహన సదస్సుకు ప్రొ.జీబీ రెడ్డి హాజరై మాట్లాడారు. విద్యావేత్తలు, పరిశోధకులు తమ పరిశోధనలు, ఆవిష్కరణలు(కనుగొన్న నూతన అంశాలు) ప్రచురించే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమాచారాన్ని వినియోగించుకునే ముందు ఆయా అంశాలపై లోతైన పరిశీలనతో పాటు మేథో సంపత్తి హక్కులపై స్పష్టత తీసుకోవడం అవసరమన్నారు. ప్రిన్సిపల్ ప్రొ.వీరయ్య, సైన్స్ డీన్ ప్రొ.కరుణసాగర్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చెన్నరెడ్డి, టీఎస్‌సీవోఎస్‌టీ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ రాధిక ప్రసంగించారు.

ఓటర్ నమోదు కార్యక్రమాన్ని వినియోగించుకోండి

ఆల్విన్‌కాలనీ: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షుడు చంద్రారెడ్డి తెలిపారు. సెప్టెంబర్ 2,3 తేదీల్లో ప్రభుత్వం కల్పించిన ఓటరు నమోదు, చిరునామాలోని మార్పులు, చేర్పులు చేసుకోవాలన్నారు. పాపిరెడ్డినగర్ నగర్‌లోని రోడ్డు నం.2లోని రెయిన్‌బో పాఠశాల, 19 రోడ్డులోని రాజధాని పాఠశాలలో రెండు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకొని రానున్న ఎన్నికల్లో ఓటు వేసేందుకు సిద్ధంగా ఉండాలని చంద్రారెడ్డి తెలిపారు.

3న మున్నూరు కాపు జేఏసీ సమావేశం

కాచిగూడ: మున్నూరు కాపు జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3న మధ్యాహ్నం 2 గంటలకు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలోని షోయబ్ హాల్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ఎడ్ల రవి పటేల్ తెలిపారు. మున్నూరు కాపు కార్పొరేషన్ సాధన, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మున్నూరు కాపు అభ్యర్థులను గెలిపించుకోవడం తదితర అంశాలపై సమావేశంలో చర్చించి తగు నిర్ణయాలు తీసుకుంటామన్నారు. మున్నూరు కాపులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సూచనలు, సలహాలు ఇచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రహస్యంగా వీడియో తీసిన యువకుడి అరెస్టు

అమీర్‌పేట్: యువతి స్నానం చేస్తుండగా రహస్యంగా సెల్‌ఫోన్‌లో వీడియో చిత్రీకరిస్తున్న యువకుడిని ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఇన్‌స్పెక్టర్ రామప్రసాద్‌రావు వివరాల ప్రకారం.. ఎస్‌ఆర్‌నగర్‌లో ఉంటున్న ఓ యువతి (22) బుధవారం రాత్రి బాత్రూమ్ స్నానం చేస్తుండగా వెంటిలేషన్ నుంచి ప్రశాంత్ అనే యువకుడు సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తుండగా గమనించిన యువతి కేకలు వేయడంతో పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ప్రశాంత్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీహోమం

సనత్‌నగర్: నిజశ్రావణ మాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం దుర్గామాత అమ్మవారి ఆలయంలో గురువారం చండీహోమం నిర్వహించారు. ఈఓ శ్రీనివాసరాజు పర్యవేక్షణలో అర్చకులు సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన చండీ హోమం కార్యక్రమానికి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే శివాలయం అర్చకులు రిపుంజయశర్మ ఆధ్వర్యంలో మల్లికార్జున స్వామివారిని ప్రత్యేకంగా రాఖీలతో అలంకరించిన తీరు భక్తులను ఆకట్టుకుంది. సంతోషిమాత అమ్మవారి పుట్టినరోజు సందర్భంగా 108 కలశాలతో ప్రత్యేక అభిషేకం, విశేష పుష్పాలంకరణ చేశారు.

విద్యార్థులు నూతన సాంకేతికతను అభ్యసించాలి

ఘట్‌కేసర్: ఆవిష్కరణల కోసం విద్యార్థులు నూతన సాంకేతికతను అభ్యసించాలని ఉస్మానియా బిజినెస్ ఇంక్యూబేటర్ సీఈఓ హఫీజ్ భాషా, గౌరవ అతిథి వోర్‌ల్యాబ్స్ టెక్నాలజీస్ నిర్వాహకుడు దేబీప్రసాద్ బెనర్జీ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో కృత్రిమ మేధస్సుపై 48 గంటల హ్యాకథాన్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హ్యాకథాన్ ద్వారా కృత్రిమ మేధస్సు మెరుగుపడుతుందని అన్నారు. విద్యార్థులు హ్యాకథాన్‌లో పాల్గొని వ్యక్తిగత నైపుణ్యం పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ బాలాజీ ఉట్ల, స్టూడెంట్ స్ట్రాటజీ డైరెక్టర్ పల్లా అనురాగ్, డీన్ విజయకుమార్, హెచ్‌ఓడీ మల్లికార్జున్‌రెడ్డి, పరదీప్, సాయికార్తీక్, కార్తీక్‌రావు, తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలు

నేడు హెచ్‌ఐసీసీలో స్వతంత్ర్య భారత వజ్రోత్సవాల ముగింపు వేడుకలు

రాయదుర్గం: భారత స్వతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు వేడుకల సందర్భంగా మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీ ప్రాంతంలో శుక్రవారం సైబరాబాద్ ట్రాఫిక్ విభాగం పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో ఆయా మార్గాలలో ట్రాఫిక్ సమస్యల నివారణకు చర్యలు తీసుకున్నారు.

ఆంక్షలు అమలయ్యే సమయాలు..
ఉదయం 7 గంటల నుంచి..
సాయంత్రం 6 గంటల వరకు..

- నీరూస్ జంక్షన్-సైబర్‌టవర్స్ జంక్షన్, మెటల్ చార్మినార్ జంక్షన్, గూగుల్(సీఐఐ) జంక్షన్, కొత్తగూడ జంక్షన్ రోడ్డు
- మెటల్ చార్మినార్ జంక్షన్, ఖానామెట్ జంక్షన్, హైటెక్స్/హెచ్‌ఐసీసీ/న్యాక్‌రోడ్డు
- జేఎన్‌టీయూ-సైబర్ టవర్స్, బయోడైవర్సిటీ జంక్షన్
- గచ్చిబౌలి జంక్షన్, బొటానికల్ గార్డెన్ జంక్షన్, కొత్తగూడ జంక్షన్, కొండాపూర్ జంక్షన్

ప్రత్యామ్నాయ మార్గాలు.......

- ట్రాఫిక్ నీరూస్ నుంచి గచ్చిబౌలి జంక్షన్ వైపు ట్రాఫిక్‌ను సీఓడీ (అయ్యప్ప సొసైటీ మాదాపూర్) వద్ద మళ్లించబడుతుంది.
- దుర్గంచెరువు వైపు-ఇనార్బిట్-ఐటీసీ కోహినూర్-ఐకియా బయోడైవర్సిటీ గచ్చిబౌలి, సైబర్ టవర్స్ జంక్షన్‌ను నివారించాలి
- మియాపూర్, కొత్తగూడ, హఫీజ్‌పేట్ ప్రాంతాల నుంచి హైటెక్‌సిటీ వైపు ట్రాఫిక్ సైబర్‌టవర్స్-జూబ్లీహిల్స్ రోలింగ్ హిల్స్, ఏఐజీ ఆస్పత్రి-ఐకియా-ఇనార్బిట్-దుర్గంచెరువు రహదారిని ఉపయోగించవచ్చు. సైబర్ టవర్స్ జంక్షన్‌ను నివారించండి
- ఆర్‌సీపురం, చందానగర్ నుంచి మాదాపూర్, గచ్చిబౌలి ప్రాంతాల వైపు ట్రాఫిక్ ఉండవచ్చు.
- బీహెచ్‌ఈఎల్-నల్లగండ్ల-హెచ్‌సీయూ, ట్రిపుల్ ఐటీ గచ్చిబౌలి రోడ్డును వినియోగించాలి. ఆల్విన్, కొండాపూర్‌ను రోడ్డును నివారించాలి.

భారీ వాహనాలపై ఈ రూట్లలో..

- జేఎన్‌టీయూ నుంచి సైబర్ టవర్స్
- మియాపూర్ నుంచి కొత్తగూడ
- కావూరి హిల్స్ నుంచి కొత్తగూడ
- బయోడైవర్సిటీ నుంచి సైబర్‌టవర్స్
- నారాయణమ్మ కాలేజ్ నుంచి గచ్చిబౌలి

నా సమాజమే.. నా కుటుంబం



జీహెచ్‌ఎంసీ కార్మికులకు నిత్యవసరాలను అందజేస్తున్న అహ్మద్

రంగారెడ్డినగర్: సమాజమే కుటుంబంగా భావించి సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని లామ్రా సోషల్ సర్వీస్ సంస్థ నిర్వాహకుడు లామ్రా అహ్మద్ అన్నారు. గురువారం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలో పేద ప్రజలకు, జీహెచ్‌ఎంసీ కార్మికులకు మొత్తం 150 మంది లామ్రా సంస్థ ఆధ్వర్యంలో నిత్యవసరాలను అందజేశారు. ఈ సందర్భంగా అహ్మద్ మాట్లాడుతూ.. నిరుపేదలను ఆదుకునేందుకు పలు సేవా కార్యక్రమలు చేపడుతూ వస్తున్నామని తెలిపారు. గతంలో జీహెచ్‌ఎంసీ ఉద్యోగిగా పనిచేసిన తన తండ్రి ఆశయాలను అనుగుణంగా సంస్థను నెలకొల్పి ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫర్జానాబేగం, సమీర్, మోసిన్, సల్మాన్, జమీర్, లింగేశ్వరరావు, నిజాముద్దీన్, సాదిక్ తదితరులు ఉన్నారు.

ఉప్పల్‌లో కార్పొరేటర్ కార్యాలయం

ఉప్పల్: ఉప్పల్ డివిజన్‌లో రూ.85 లక్షలతో నిర్మించిన కార్పొరేటర్ కార్యాలయాన్ని గురువారం ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ మందుముల రజిత పరమేశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలకులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, అందుకు ఒక కార్యాలయం అవసరమన్నారు. ఉప్పల్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ ఇక నుంచి ప్రజలకు ఇక్కడి నుంచే సేవలను అందించనున్నట్లు తెలిపారు.

'పుర' కార్మికులకు ఆరోగ్య భద్రత

- ఇక పురపాలక సంఘాల్లోని కార్మికులకు పూర్తిస్థాయిలో ఈఎస్‌ఐ వర్తింపునకు చర్యలు
- నగర శివారుల్లోని 29 పురపాలికల్లో పనిచేస్తున్న 5,897 మంది కార్మికులకు ప్రయోజనం

సాక్షి, మేడ్చల్ జిల్లా: పురపాలక సంఘాల్లో పనిచేస్తున్న కార్మికులకు ఇక పూర్తి స్థాయిలో ఈఎస్‌ఐ అమలు కానుంది. ఈ మేరకు ఇటీవల పురపాలక శాఖ ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఈఎస్‌ఐ(ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్, పీఎఫ్ (ప్రావిడెండ్ ఫండ్) సౌకర్యం కల్పించినా.. ఆయా చెల్లింపులు చేయకపోవడంతో సేవలు అందేవి కావు. కొన్ని పురపాలికలు మూడు, నాలుగు నెలలకు ఓసారి ఈఎస్‌ఐ రుసుం జమ చేసేవి. దీన్ని గుర్తించిన పురపాలకశాఖ ఒక ప్రతినెలా కచ్చితంగా ఈఎస్‌ఐ చెల్లింపులు చేయాలని ఆదేశించింది.

5,897 మంది కార్మికులకు ప్రయోజనం...

గ్రేటర్ శివారు జిల్లాలలో 29 పురపాలక సంఘాలు ఉన్నాయి. వీటిలో అన్ని విభాగాల్లో కలిపి 5,897 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరు అనారోగ్యానికి గురైతే పురపాలికల తీరువల్ల ఈఎస్‌ఐ ఆసుపత్రుల్లో వైద్య సేవలు పొందలేని పరిస్థితి ఏర్పడింది. కొన్ని పురపాలికల్లో బకాయిలు చెల్లించకపోవడంతో కార్డులున్నా.. నిరుపయోగంగా.. మారాయనే విమర్శలొస్తున్నాయి. ఇకమీద నెలనెలా ఈఎస్‌ఐ రుసుం చెల్లిస్తే కార్మికుల వైద్య సేవలకు ప్రయోజనం దక్కనుంది. ప్రతి నెలా కార్మికులకు చెల్లించే వేతనాల్లో పీఎఫ్ వాటాగా 12 శాతం, ఈఎస్‌ఐ వాటాగా 0.75 శాతం మినహాయించుకుంటారు. ఆ మొత్తాన్ని అదే నెల 15వ తేదీలోపు సంబంధిత ఖాతాలకు జమ చేయనున్నారు. కార్మికులు, వారి కుటుంబ సభ్యులు ఏడాదికి రూ. 2.5 లక్షల వరకు వైద్యాన్ని ఉచితంగా పొందటానికి అవకాశముంటుంది.

నేటి నుంచి బీజేపీ మట్టి సేకరణ కార్యక్రమం

కూకట్‌పల్లి: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత వాటికను నిర్మించడానికి దేశంలో ప్రతి గ్రామం నుంచి మట్టి సేకరణకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు ఇచ్చిన విషయం తెలిసిందే. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్‌ప్రకాష్ నడ్డా ఆదేశాల మేరకు 'నా భూమి – నాదేశం'అనే నినాదంతో సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 30వ తేదీ వరకు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పలు కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. కాసం వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు.

◆ ఈ కార్యక్రమాల్లో అన్ని సామాజిక వర్గాల ప్రముఖులు, యువతను కలుపుకొని సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు దేశభక్తి కార్యక్రమం నిర్వహించాలన్నారు. జాతీయ పతాకం తప్ప పార్టీ పతాకాలు, కండువాలు వాడొద్దని తెలిపారు. కాషాయ కండువాలు ధరించవచ్చన్నారు. మట్టి లేదా బియ్యం ఇవ్వడానికి నిరాకరించిన వారిని బలవంత పెట్టొద్దని సూచించారు. ఇది పూర్తిగా దేశభక్తి కార్యక్రమం అని తెలిపారు.

- గ్రామం నుంచి అమృత్ కలశ్ యాత్ర

◆ స్వాతంత్ర్య సమరయోధుల ఇళ్ల నుంచి.. తెలంగాణ విమోచన కోసం పోరాడి అమరవీరుల ఇళ్ల నుంచి.. కేంద్ర, రాష్ట్ర భద్రతా దళాల ఇళ్ల నుంచి తప్పని సరిగా మట్టి, బియ్యపు గింజలను సేకరించాలి. ఈ కార్యక్రమాన్ని గ్రామంలోని బొడ్రాయి లేదా గుడి నుంచి ప్రారంభించాలి. అదే విధంగా అనువైన ప్రదేశంలో 75 మొక్కలు నాటాలన్నారు. మట్టి సేకరణ పూర్తయిన తరువాత అమృత కలశాన్ని మండల కేంద్రానికి తరలించేంత వరకు ఒక పవిత్రస్థలంలో భద్రపర్చాలని తెలిపారు. ప్రతి మండలానికి ఒక కలశ్ ప్రముఖ్‌ని నియమించాలని సూచించారు.